ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 జనవరి 2024





వీరవాసరంలో నోటీసులు అందజేత

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం



కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో నిర్బంధించిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపింది. సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి సోమవారం 'ఛలో విజయవాడ'కు పిలుపునిచ్చిన అంగన్‌వాడీలపై పోలీసులు విరుచుకుపడ్డారు. ఆదివారం రాత్రి నుంచి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 560 మందిని, ఏలూరు జిల్లాలో 639 మందిని అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ పెద్దలతో సోమవారం అర్ధరాత్రి జరిగిన చర్చలు సఫలం కావడంతో నేటి నుంచి విధుల్లోకి చేరనున్నట్టు అంగన్‌వాడీ నాయకులు తెలిపారు.

భీమవరం/ఏలూరు, జనవరి 22 : అంగన్‌వాడీలు 41 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. జిల్లాలో వీరంతా సమ్మెబాట పట్టారు. ఇప్పటికే ఎస్మా కింద జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు జారీచేసినా లెక్క చేయకుండా సమ్మెలోనే ఉన్నారు. సోమవారం సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి 'చలో విజయవాడ' ఆందోళనకు పిలుపు నిచ్చారు. దీనిని విఫలం చేసేందుకు పోలీసులు 21వ తేదీ మధ్యాహ్నం నుంచే రంగంలోకి దిగారు. ముఖ్య నాయకులు, ప్రజా సంఘ నాయకులకు నోటీసులు జారీచేశారు. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్నిప్రధాన రహదారుల్లోనూ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కైకరం సెంటర్, భీమడోలు, దెందులూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని భీమడోలు సెంటర్‌లో పోలీసులు జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. కలపర్రు టోల్‌గేటు వద్ద పెదపాడు పోలీసులు తనిఖీలు చేశారు. అనుమానం కల్గిన వారిని అక్కడికక్కడే దించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఏలూరు నగరంలో ఎస్పీ మేరీ ప్రశాంతి రైల్వే స్టేషన్‌లో, కొత్త బస్టాండ్‌లో పరిశీలన చేశారు. ఏలూరు వన్‌టౌన్‌లో 10 మందిని, టూ టౌన్‌లో 38 మందిని, త్రీ టౌన్‌లో 35 మందిని, రూరల్‌లో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీలకు పచ్చి మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా నరకం చూపించారు. సీఆర్‌పీసీ 151 కింద జిల్లావ్యాప్తంగా 639 మందిని ముందస్తు అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తులపై సోమవారం సాయంత్రం విడిచి పెట్టారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారిని పోలీసులే స్వయంగా తీసుకువెళ్ళి రైళ్ళు ఎక్కించారు. మరికొంత మందిని బస్సులు ఎక్కించి పంపించి వేశారు.

ఏలూరులో ఉద్రిక్తత

అంగన్వాడీల అడ్డగింత, అరెస్టులపై వామపక్షాలు రాస్తారోకోలు, ధర్నాలకు పిలుపునిచ్చారు. విజయవాడ, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలకు చెందిన 70 మంది అంగన్వాడీలను విజయవాడ నుంచి 50 మంది సామర్థ్యం గల ఒక బస్సులో కుక్కి ఏలూరు తీసుకొచ్చారు. కొత్తబస్టాండ్ వద్ద వారిని ఎండలో కూర్చోబెట్టి పోలీసులు ముప్పతిప్పలు పెట్టారు. అంగన్వాడీలు ఎదురు తిరగడంతో పెదవేగి తరలించే క్రమంలో ఫైర్‌స్టేషన్ వద్ద అప్పటికే రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాలు గుర్తించి బస్సును అడ్డుకున్నారు. బస్సు నుంచి దిగుతున్న అంగన్వాడీలను నిలువరించాలని పోలీసులు ప్రయత్నించినా ఆపలేకపోయారు. చాలాసేపు వామపక్షాలతో కలిసి అక్కడే రాస్తారోకో నిర్వహించారు. 24 గంటల నుంచి సరైన తిండి, నీరు లేక అంగన్వాడీలు నీరసించిపోయారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు మేము వెనుదిరిగి ఇళ్లకు వెళ్లేది లేదని మరలా మమ్మల్ని విజయవాడ తరలించమని డిమాండ్ చేశారు. ధర్నా చేసిన వారంతా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన వారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని స్థానిక అంగన్‌వాడీలను, వివిధ సంఘాల నాయకులను టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ నుంచి తరలించిన వారిని తిరిగి అదే బస్సులో పెదవేగి పోలీసు అకాడమికి తరలించి సాయంత్రం అక్కడ విడిచిపెట్టారు. విడుదల చేసిన అంగన్వాడీ కార్యకర్తలను విజయవాడ తీసుకెళ్తామని చెప్పి ఏలూరు ఆశ్రం ఆస్పత్రి నుంచి రాజమండ్రి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అంగన్వాడీలు ప్రతిఘటించి ఆశ్రం ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న యూనియన్ నాయకులు 13 మందిని విడుదల చేయలేదు. వీరిని పెదవేగి, దెందులూరు పోలీస్‌స్టేషన్లకు తిప్పుతున్నారు. వీరిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.



అరెస్టులను ఖండిస్తూ ఏలూరులో రాస్తారోకో చేస్తున్న వివిధ సంఘాలు

మచిలీపట్నం పోర్టులో గణపవరం మండల కార్యకర్తలు



అర్ధాకలితో నరకం చూశారు

పెదవేగి : వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను గుర్తించి, కొంతమందిని పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రానికి(డీటీసీ) తరలించారు. ఏలూరు, పెదవేగి, పెదపాడు, బుట్టాయి గూడెం, పోలవరం, దెందులూరు తదితర ప్రాంతాలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500లకు పైగా అంగన్‌వాడీలను డీటీసీలోకి తీసుకెళ్లిన పోలీసులు వారికి ఆహారం అందించడంలో విఫలమయ్యారు. ఉదయం ఉప్మా చేయించిన అధికారులు 500 మందిలో ఓ 200 మందికి అందించగా, తక్కిన వారు పస్తులున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు మరో 300 మందికి భోజనాలు ఏర్పాటుచేయగా, మిగిలిన 200 మంది ఆకలి తీర్చుకునే దారి కోసం అలమటించారు. తమను పరామర్శించడానికి వచ్చిన వామపక్షాల నేతల దగ్గర అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు.

500 మంది నిర్బంధం

నూజివీడు : విజయవాడకు చేరుకున్న అంగన్‌వాడీలను అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు తరలించారు. నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలకు మొత్తం ఎనిమిది బస్సుల్లో 500 మంది అంగన్‌వాడీలను తరలించి నిర్బంధంలో ఉంచారు. బస్సుల్లో కనీసం మంచినీళ్ల ఇవ్వలేదని, మూత్ర విసర్జనకు అనుమతించకుండా అమానుషంగా ప్రవర్తించారని వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటలకు బస్సు ఎక్కించి గన్నవరం, బాపులపాడు, ఆగిరిపల్లి తీసుకొచ్చారని అక్కడ పోలీస్‌స్టేషన్‌లలో ఖాళీగా లేవని, చివరికి నూజివీడుకు తీసుకొచ్చారని అంగన్‌వాడీలు వాపోయారు. కళాశాల ప్రాంగణంలో అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. సాయంత్రం వారిని అక్కడ నుంచి పంపివేశారు.

15 బస్సుల్లో తరలింపు

కైకలూరు : విజయవాడ చేరుకున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సుమారు 800 మందిని సుమారు 15 బస్సుల్లో కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌కు తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో తీసుకొచ్చి నిర్బంధించారు. చిత్తూరు, తిరుపతి, అనంతపురం, నెల్లూరు, ఉభయ గోదావరి, కోనసీమ, కృష్ణా జిల్లాల నుంచి అంగన్వాడీ టీచర్లు, ఆయాలను తీసుకొచ్చి మంచులోనే సీఎన్నార్ గార్డెన్ బయట వదిలేసి గేట్లకు తాళాలు వేసి నిర్బంధించారు. ఈ సంగతి బయటకు పొక్కకుండా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని మైక్ ఏర్పాటు చేసి భక్తి గీతాలు విన్పిస్తూ మభ్య పెట్టే ప్రయత్నాలు చేశారు. మంచినీరు, తినేందుకు ఆహారం ఇవ్వకుండా మధ్యాహ్నం వరకు కూర్చోబెట్టారు. చివరకు ఈ సమాచారం మీడియాకు అందడంతో అక్కడ చేరుకుని అంగన్వాడీ కార్యకర్తలను ఫోటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నించగా కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు మీడియాను లోపలకు పంపించవద్దని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో విలేకర్లకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. తమకు కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని 800 మంది కార్యకర్తల్లో అనేకమంది షుగరు, బీపీలతో బాధపడుతున్నామని గంటల తరబడి మంచులో వదిలివేసి పోలీసులు నియంతలా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు.

చలో విజయవాడ అడ్డగింత

సమస్యల పరిష్కారానికి 42 రోజులుగా ఆందోళనలు
సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి ఛలో విజయవాడ పిలుపు
ఎక్కడికక్కడ అడ్డగింత.. అరెస్టులతో పోలీసుల నిర్బంధం
కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వకుండా స్టేషన్లను తిప్పారు
నిలువరించిన వామపక్షాలు.. ధర్నాలతో దద్దరిల్లిన ఏలూరు
మచిలీపట్నం పోర్టులో గణపవరం కార్యకర్తల నిర్బంధం
పెదవేగి డీటీసీలో 200 మందికి పైగా ఆకలి మంటలు
కైకలూరులో 800 మంది నిర్బంధం.. పోలీసుల అత్యుత్సాహం
కార్యకర్తల నినాదాలు విన్పించకుండా బయట మైక్‌లో శ్రీరాముని పాటలు
మీడియాను అడ్డుకున్న పోలీసులు.. టీడీపీ నేతల నిరసన
అర్ధరాత్రి దిగివచ్చిన ప్రభుత్వం.. డిమాండ్లకు అంగీకారం..నేటి నుంచి విధుల్లోకి



బస్సుల్లో అంగన్ వాడీలను తీసుకువస్తున్న పోలీసులు



కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డగింత

అరెస్టులు.. ఆందోళనలు

గణపవరం : గణపవరం అంగన్వాడీలను విజయవాడలో పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా అంగన్వాడీల సంఘం అధ్యక్షురాలు కే.ఝాన్సీ గణపవరం నుంచి వెళ్లారు. విజయవాడలో గణపవరం మండలానికి చెందిన సుమారు 90 మందిని వివిధ బస్సుల్లో మచిలీపట్నం పోర్టుకు తరలించి నిర్బంధించారు. ఈ విషయాన్ని ఫోన్‌లో ఇక్కడి విలేకరులకు సమాచారం ఇచ్చారు. సుమారు ఐదు వేల మంది వరకు అంగన్వాడీలు ఉన్నారని 2 గంటల వరకు ఎటువంటి ఆహారం ఇవ్వలేదన్నారు. గణపవరం మండల సీఐటీయూ అధ్యక్షుడు పెంటా రావును గణపవరం పోలీస్‌స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ : విజయవాడ బయలుదేరిన అంగన్‌వాడీలను తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసు స్టేషన్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

వీరవాసరం : సీఐటీయూ అంగన్‌వాడీ నాయకురాలు నాగరత్నంకు నోటీసు అందించి గృహ నిర్బంధం చేశారు. వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ సెక్టార్‌లకు చెందిన కొందరు అంగన్వాడీలు ఆదివారం బృందాలుగా విజయవాడ వెళ్లిపోయారు.

భీమవరం క్రైం : భీమవరం రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు, టూ టౌన్ పరిధిలో 22 మంది, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లోసరి చెక్ పోస్టు వద్ద 15 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు స్టేషన్‌లలో ఉంచి విడిచి పెట్టారు.

తొలగింపు ఉత్తర్వులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం వేటు వేసింది. సోమవారం సాయంత్రం వారిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలిచ్చారు. జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు 1605, సహాయకులు 1518 మంది మొత్తం 3,123 మంది ఉండగా వీరిని తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె నుంచి వైదొలగిన వారిలో కార్యకర్తలు 276 మంది, సహాయకులు 230 కలిపి 506 మంది విధుల్లో జాయిన్ అయ్యారు. దీంతో మిగిలిన వారిపై వేటు వేశారు. గత నెల 12వ తేదీ నుంచి అంగన్‌వాడీల సమ్మె ప్రారంభమైంది. సోమవారం నాటికి 41 రోజులు పూర్తయింది. అంగన్‌వాడీ ఉద్యమకారులు సుమారు 15 వందల మంది విజయవాడ వెళ్ళారు. వారిని అక్కడ అరెస్టు చేశారు. ఈలోగా సాయంత్రానికి వారిని తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో లెక్కల ప్రకారం 1,523 కేంద్రాల్లో కార్యకర్తలు 1,540 మంది. మినీ టీచర్లు 75 మంది, సహాయకులు 1,541 మంది మొత్తం సమ్మెలో పాల్గొన్నారు. చివరికి ప్రభుత్వ హెచ్చరికతో చివరకు 507 మంది విధుల్లో చేరగా 3123 మందిపై వేటు వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రభుత్వ నిర్ణయం దారుణం



అంగన్‌వాడీలు న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. అటువంటి వారికి న్యాయం చెయ్యకుండా తొలగిస్తూ తీసు కున్న నిర్ణయం చాలా దారుణం. మహిళా హక్కులను కాలరాస్తూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తగిన బుద్ధి చెబుతాం. రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తాం.

-ఝాన్సీ, జిల్లా అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

ప్రభుత్వం ఫలితం అనుభవిస్తుంది



ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యమానికి చేసిన ద్రోహానికి ఫలితం అనుభవిస్తుంది. మహిళలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 40 రోజులుగా చేస్తున్న ఉద్యమానికి న్యాయం చెయ్యకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవటాన్ని మహిళా లోకం చూస్తూ ఊరుకోదు.

-ఎండీ హసీనాబేగం, జిల్లా సహాయ కార్యదర్శి



తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



జై శ్రీరామ్..జై శ్రీరామ్

ఎటు చూసినా రామ భక్తులే.. ఎక్కడ విన్నా శ్రీరామ నామ జపమే.. జై శ్రీరామ్ అంటూ జిల్లా అంతా మారు మోగింది. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా శోభాయాత్రలు చేపట్టారు. ఊరేగింపులు చేశారు. ఆలయాల్లో రామజపం, హనుమాన్ చాలీసాల పఠనంతో ఎక్కడ చూసినా అధ్యాత్మిక శోభ కనిపించింది. రామాలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. అయోధ్య ప్రతిష్ఠా కార్యక్రమాలను ఎల్‌ఈడీ స్క్రీన్లపై తిలకించారు. రాత్రి ప్రతీ ఇంటా దీపాలు వెలిగించారు. గణపవరం మండలం పిప్పరలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు..

8లో..

ఓటర్ల లెక్క తేలింది

జిల్లా ఓటర్లు 14,61,338

పురుషులు : 7 లక్షల 16 వేల 956 మంది
మహిళలు : 7 లక్షల 44 వేల 308 మంది
మహిళలే అధికం.. ఆసక్తి చూపిన యువత

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించారు. గడచిన మూడు నెలలపాటు ముసాయిదా ఓటర్ల జాబితా కోసం జిల్లా ఎన్నికల అధికారులు కసరత్తు చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. పేర్లు మార్పులు చేశారు. కొత్త ఓట్లు నమోదు చేశారు. అభ్యంతరాలను పరిష్కరించారు. అడ్రస్‌లు మార్పు చేశారు. ఓటర్ల జాబితా విషయమై కేంద్ర ఎన్నికల సంఘం రెండు పర్యాయాలు సమీక్ష నిర్వహించింది. జాబితాలో మార్పులు, చేర్పులు, దరఖాస్తుల స్వీకరణ వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చారు. తుది ఓటర్ల జాబితాలో మహిళల సంఖ్యే అధికంగా ఉంది. ఓటు నమోదుకు యువత ఆసక్తి చూపింది. జిల్లా వ్యాప్తంగా 31,819 మంది యువత కొత్తగా ఓట్లు నమోదు చేసుకున్నారు. జిల్లాలో అత్యధికంగా ఓటర్లు భీమవరం నియోజకవర్గంలో ఉన్నారు. నర్సాపురం నియోజకవర్గంలో జిల్లాలోని నియోజకవర్గాల కంటే తక్కువగా ఉన్నారు.తుది జాబితా ప్రకారం జిలల్లాలో 14,61,338 మంది ఓటర్లు ఉన్నట్టు ప్రకటించారు. అందులో పురుషులు 7,16,956 మంది. స్త్రీలు 7,44,308 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 74 మంది ఉన్నట్లు లెక్కతేల్చారు.



ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్ లేవు

భీమవరం టౌన్, జనవరి 22 : జిల్లాలో 14 లక్షల 61 వేల 338 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించారు. కలెక్టరేట్‌లో సోమవారం తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తుది ఓటర్ల జాబితా వారికి అందజేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు దాఖలు చేసిన ప్రతి ఫిర్యాదును పూర్తిగా విచారిం చామన్నారు. ఎన్నికల కమిషన్ కార్యాలయానికి కూడా నివేదిక అందించామని, ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్ లేవన్నారు. తుది జాబితాను ప్రచురణ తర్వాత కూడా ఏదైనా అభ్యంతరాలు వుంటే దాఖలు చేసుకోవచ్చునన్నారు. శిక్షణ డిప్యూటి కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వై.దుర్గాకిషోర్, డిప్యూటీ తహసీల్దారు సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు (వైసీపీ), మరపట్ల శ్యాంబాబు (టీడీపీ), కోమటి రవికుమార్ (బీజేపీ), తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి (కాంగ్రెసు), బి.బలరామ్ (సీపీఎం) పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్
ఆచంట	1,78,668	88,319	90,348	1
పాలకొల్లు	1,93,379	95,079	98,293	7
నరసాపురం	1,68,187	83,745	84,442	---
భీమవరం	2,51,301	1,22,228	1,29,023	50
ఉండి	2,22,999	1,09,414	1,13, 583	2
తణుకు	2,33,082	1,13,780	1,19, 296	6
తాడేపల్లిగూడెం	2,13,722	1,04,39	1,09,323	8
మొత్తం ఓటర్లు	14,61,338	7,16,956	7,44,308	74

జై శ్రీరామ్


భీమవరంలో బాల హనుమాన్‌లు


పెనుమంట్రలో రాముని వేషధారణలతో గ్రామోత్సవం


ఆరుగొలనులో శోభాయాత్ర


ఏలూరు రామకోటిలో హనుమాన్ వేషధారుల జైశ్రీరామ్ నినాదాలు


పెనుగొండలో విద్యార్థుల జై శ్రీరామ్ ఆకృతి


జంగారెడ్డిగూడెం నూకాలమ్మ గుడి వద్ద దీపాలతో జై శ్రీరామ్



అట్టహాసంగా శోభాయాత్ర

ద్వారకాతిరుమల, జనవరి 22: అయోధ్య రామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం శ్రీవారి క్షేత్రంలో భక్తులు అట్టహాసంగా శోభాయాత్ర నిర్వహించారు. రథంపై సీతారామలక్ష్మణుల విగ్రహాలను వుంచి కుంకుళ్లమ్మ ఆలయం నుంచి చిన తిరుమలేశుని ఆలయం వరకు భక్తి శ్రద్ధలతో యాత్ర జరిపారు. మహిళలు, చిన్నారుల కోలాట భజనల నడుమ ఈ యాత్ర క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. బాలరామ, లక్ష్మణ వేషాలు ఆకట్టుకున్నాయి. చెరువువీధి రామాలయంలో రాములోరి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు.


ఆకట్టుకున్న చిన్నారుల రామలక్ష్మణుల వేషధారణ




అగ్గిపుల్లపై బాలరాముడు

ఏలూరు కల్చరల్ : అయోధ్య రామ మందిరంలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేశ్‌బాబు సెంటి మీటర్ ఎత్తులో అగ్గి పుల్లపై బాలరాముడిని చెక్కి ఔరా అనిపించాడు.

అంగన్‌వాడీల ఆక్రందన


ఏలూరులో నిలిచిన ట్రాఫిక్


ఏలూరులో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


ఏలూరు బస్టాండ్‌లో అంగన్‌వాడీలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళుతున్న వారిని నిర్దాక్షిణ్యంగా ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ఏలూరు తీసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది.



నిర్బంధకాండ





ఏలూరు : విజయవాడతోపాటు ఏలూరు మీదుగా వెళుతున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి బస్సుల్లో తీసుకువస్తున్న దృశ్యాలు

మన్యంలో పులి సంచారం?


ఎర్రాయిగూడెం-మంగదేవిపేట వద్ద గుర్తించిన పాదముద్రలు

బుట్టాయగూడెం, జనవరి 22: పశ్చిమ ఏజెన్సీ మన్యం ప్రాంతంలో కొన్నిరోజులుగా పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఏసమయంలో దాడిచేస్తుందోనని బిక్కు బిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్నారు. మూగజీవాల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎర్రాయిగూడెం, కొయ్యలగూడెం మండలం మంగ దేవిపేట సమీపంలో చెరువు వద్ద పులి పాదముద్రలను సోమవారం గుర్తించిన గ్రామస్థులు, ఇదే విషయాన్ని కన్నాపురం అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పాద ముద్రలు ఉన్న ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. అవి పులి పాదముద్రలు కావని అధికారులు తేల్చిచెప్పారు. పులి పాదముద్రలు ఇంకా పెద్దవిగా ఉంటాయని, ఆకలితో ఉన్న పులి గ్రామాల్లోకి వస్తే పశువులపై దాడిచేయకుండా ఉండదని తెలిపారు. పాదముద్రలు ఉన్న ప్రదేశం పక్కనే పశువులు ఉన్నాయని వాటిపై ఎటువంటి దాడి జరగలేదని ఎఫ్ఎస్‌వో మూర్తి చెప్పారు. మన్యంలో పులి సంచారం లేదన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందవద్దని అన్నారు. అవి అడవిపిల్లి పాదముద్రలుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాట చార్జీల అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోండి : ప్రభుత్వానికి లేఖ

పాలకొల్లు, జనవరి 22: అక్రమంగా బాట చార్జీలు వసూలు చేస్తున్న ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జ్ అంజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఉభయగోదావరి లారీ అసోసియేషన్, బిల్డర్ కార్మికులు, డ్రైవర్ అసోసియేషన్, భవన నిర్మాణ కార్మికులు, ర్యాంప్ బంటా కార్మికులు సంయుక్తంగా ప్రభుత్వానికి ఓ లేఖ రాశారు. సౌత్ ఇండియా ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జ్ అంజి రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక దందా చేస్తున్నారని, గతంలో జేపీ సంస్థ బాట చార్జీలు లేకుండా నడిపేవారని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే టన్ను రూ.475కు అమ్మేవారని చెప్పారు. అయితే ఇప్పుడు అదనంగా చెల్లిస్తేనే లోడు చేయాలని ర్యాంపు సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆరు చక్రాల లారీకి రూ.1,000, పది చక్రాల లారీకి రూ1,500, 12 చక్రాల లారీకి రూ.2,000 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ చెల్లింపుల్లో రశీదులు ఉండవని చెప్పారు. దీనిపై తాము గత మూడు రోజులుగా ధర్నా చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. రేట్లు తగ్గించమని అధికారులకు మొరపెట్టుకున్నా 'మా చేతుల్లో ఏమీ లేదు.. ప్రతిమ గ్రూప్ ఇన్‌చార్జి అంజిరెడ్డి కుదరదు అంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

26న ఏలూరుకు షర్మిల రాక

ఏలూరు కార్పొరేషన్, జనవరి 22 : ఏపీసీసీ పగ్గాలు చేపట్టిన షర్మిల ఈనెల 26న ఏలూరు నగరానికి విచ్చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఐకమత్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ముండూరుకు చెందిన సీనియర్ నేత ఆలపాటి నరసింహమూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు ప్రకటించారు. ప్రతాప బాల వెంకట సుబ్రహ్మణ్యం, గౌడు రంగబాబు, గణపతిరాజు, కె.మూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు. కాగా, అసోంలో నిర్వహిస్తున్న న్యాయ జూడో యాత్రపై జరిగిన దాడికి నిరసనగా నగరంలో రాస్తారోకో జరిపారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ

ఏలూరు క్రైం, జనవరి 22 : వైద్యశాఖలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై నమోదైన కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. 2023లో వైద్య విధాన పరిషత్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ రకాల పోస్టులకు నోటిఫికేషన్ జారీచేయగా.. ఆడియోమెట్రిక్ టెక్నీషియన్ పోస్టులకు కొందరు దరఖాస్తులు చేశారు. అర్హత ఉన్నవారిని కాదని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఓ ఉద్యోగిని అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆధారాలతో ఉన్నతాధికారులకు సమర్పించడంతో ఏలూరుజిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ చేశారు. అక్రమాలు జరిగాయని, నకిలీ సర్టిఫికెట్లతోనే ఉద్యోగాలు పొందారని కలెక్టర్‌కు నివేదిక అందించడంతో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశాలతో ప్రస్తుత డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్ కుమార్ ఆ ఇద్దరు నకిలీ ఉద్యోగులపై ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిత్రానంద్, వీరల నరేష్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. అయితే అందుకు సంబంధించిన రికార్డుల కోసం పోలీసులు డీసీహెచ్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ రికార్డులు ఇవ్వడంతో అక్కడ సిబ్బంది జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు పోలీసులు రాత పూర్వకంగా నోటీసులు జారీ చేశారు. ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు, ఎంతమంది మెరిట్ లిస్టులో ఉన్నారు అనే వివరాలను తెలుసుకోవడానికి అధికారులకు నోటీసులను జారీ చేశారు. కేసును టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాధిక్ దర్యాప్తు చేస్తున్నారు. ఒకటి రెండురోజుల్లో ఇద్దరు నకిలీ ఉద్యోగులతో పాటు మరో ఇద్దరు సిబ్బందిని కూడా అరెస్టు చేస్తారని సమాచారం.

అపరిచిత వాట్సాప్ కాల్స్‌కు స్పందించొద్దు : ఎస్పీ



ఏలూరు క్రైం, జనవరి 22 : అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సప్ కాల్స్‌కు స్పందించవద్దని ఎస్పీ డి. మేరీ ప్రశాంతి సూచించారు. పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 45 మంది ఫిర్యాదుల దారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్లకు స్పందించొద్దని, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టడానికి అధికారులతో మాట్లాడారు. అప్పటికప్పుడే ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. చట్ట ప్రకారం న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైద్యాధికారి పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 22 : ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్‌పీ విభాగంలో ఎపిడెమియాలజిస్టు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25లోగా దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని అన్నారు. పూర్తివివరాలకు వెస్ట్ గోదావరి.ఏపీ.జీవోవి.ఐఎన్ సందర్శించాలని కోరారు.

నదుల్లో నీరున్నా.. సాగునీటికి కటకట!

- అడుగంటిన కాలువలు .. ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు.. ట్యాంకర్ల ద్వారా పైరును బతికించుకుంటున్న రైతన్నలు



ఆయిల్ ఇంజన్‌తో తోడుకుంటున్న నీరు, కాళ్ళలో అడుగంటిన పంట కాలువ

కాళ్ళ, జనవరి 22 : అన్నపూర్ణగా పేరుగాంచిన కోస్తాంధ్రలో సాగునీరు పూర్తిస్థాయిలో అందక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఏడాదీ ఏదో రూపేణా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని వాపోతున్నారు. మౌచింగ్ తుఫాన్ వల్ల సార్వా పంట కోల్పోగా పూర్తిగా నష్టపోయామని, దాళ్వాలోనైనా కష్టాల నుంచి గట్టెక్కవచ్చని ఆశిస్తే ఆదిలోనే సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని లబోదిబోమంటున్నారు. కాలువల్లో అరకొరగా ఉన్న నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకుంటుండడంతో పెట్టుబడి ఖర్చు తడిచి మోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాళ్వా ప్రారంభదశలోనే ఈ విధంగా ఉంటే ఆ తరువాత పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. నదుల్లో నీరున్నా సాగునీటి కొరత తప్పడం లేదంటున్నారు.

మండలంలో సుమారు 4,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కాళ్ళ, కాళ్ళకూరు, సీసలి, బొండాడ, ఏలూరుపాడు, కోమటిగుంట తదితర గ్రామాల్లో ఇప్పటికే నాట్లు ప్రారంభమయ్యాయి. నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన పంట కాలువైన కెలంక ఛానల్ పూర్తిగా అడుగంటి పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలువకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు సొంత సొమ్ముతో ఆయిల్ ఇంజన్‌లు ఏర్పాటు చేసుకుని సాగు నీటిని తోడుకుంటున్నారు. ఇప్పటికే అధిక వర్షాలు కారణంగా ఖరీఫ్ పంట పూర్తిగా నష్టం చేకూర్చిన తరుణంలో రబీ లో సాగునీటి కోసం అదనపు ఖర్చు మరింత భారమైందని రైతన్నలు వాపోతున్నారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరుతెచ్చి పంటను రక్షించుకుంటున్నట్టు చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తే కొంతమేర కోలుకుంటామని పలువురు రైతులు తెలిపారు.

కాలువకు నీరొచ్చి 15 రోజులైంది..



కె.లంక పంటకాలువను ఆనుకుని ఆరు ఎకరాలు వరి సాగు చేస్తున్నా. కాలువకు నీరు వచ్చి 15 రోజులు పైనే అవుతుంది. సార్వా తుఫాన్‌కు నీటిపాలైంది. ఇప్పుడు దాళ్వా పంట నీరు లేక ఎండిపోతోంది. ఇరిగేషన్ అధికారులు అడిగితే సమాధానం లేదు.

-బండారు శ్రీనివాసరావు, రైతు- కాళ్ళ

క్రైం కార్నర్

జాతరలో ఘర్షణ.. ఇద్దరికి తీవ్రగాయాలు

మొగల్తూరు, జనవరి 22: సత్తెమ్మ జాతరలో సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. ప్రతి మూడు సంవత్సరాలకు ఓసారి సత్తెమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆప్రాంత వాసులు రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా జాతర నిర్వహించారు. ఆలయ వర్గీయుల జాతర ముగింపును పురస్కరించుకుని అమ్మవారిని ఊరేగించి సంప్రదాయం ప్రకారం గద్దె దించే ప్రాంతంలో మరో వర్గం అక్కడ అమ్మవారిని నిలబెట్టి జాతర నిర్వహించింది. గద్దె దించే ప్రాంతంలో ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. పోలీసులకు ఒక వర్గం ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపెద్దలతో చర్చించారు. అమ్మవారిని రాగి చెట్టుకింద దింపాలని ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఈలోపు ఒక వర్గం మరో వర్గంవారి కళ్లలో కారం చిమ్మి కొట్లాటకు దిగడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసాపురం ఎస్ఐ గురవయ్య, మొగల్తూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఇరువర్గాలను చెదరగొట్టి పోలీస్ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 22 : తనను దుర్భాషలాడి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. వివరాలివి. జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ మహిళ తన భర్తతో గొడవపడి విడిపోయి కుమార్తెతో కలసి ఉంటోంది. పక్క ఇంట్లో ఉంటున్న రియాజ్‌తో సహజీవనం చేస్తోంది. అయితే రియాజ్ గత కొంత కాలంగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని, ఈనెల 11న తనను కొట్టి, కులం పేరుతో దూషించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఊరెళ్లి వచ్చేలోగా ఇంట్లో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

పెదవేగి, జనవరి 22 : చోరీపై బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి. మండలంలోని బాపిరాజుగూడెంకు చెందిన కొసరాజు ధర్మరాజు కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 17న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనకెళ్లి చూడగా బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారని గుర్తించారు. బాధితుడు ధర్మరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.60వేలు నగదుతోపాటు 20 గ్రాముల బంగారు ఆభణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభం పైకెక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

- కిందికి దించిన అగ్నిమాపక సిబ్బంది
- స్టేషన్‌కు తరలించిన పోలీసులు



ఆకివీడు రూరల్ జనవరి 22 : మండలంలోని కళింగగూడెంకు చెందిన పమిడి శ్రీనివాసరావు (48) సోమవారం విద్యుత్ స్తంభంపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సుమారు రెండున్నర గంటలపాటు స్తంభంపై ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. విద్యుత్ స్తంభం ఎక్కడం చూసిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కిందికి దించారు. పోలీసులు అతడిని, అతడి తండ్రిని స్టేషన్‌కు తరలించారు. అతడికి మూగతోపాటు మతిస్థిమితం కూడా లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. స్తంభం ఎక్కడానికి ముందు తన నివాసానికి సమీపంలో ఓ మహిళ తలపై కొట్టినట్టు, టీవీ, ఇతర పరికరాలు ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. గతంలో అనేక పర్యాయాలు విద్యుత్ స్తంభం ఎక్కినట్టు చెప్పారు.అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఐదు రోజులుగా సెల్‌టవర్‌పైనే..

భీమవరం క్రైం, జనవరి 22 : తనకు రావాల్సిన జనరల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పత్రాలు ఇవ్వడం లేదంటూ ఐదు రోజులుగా లోకం ఏసు అనే వ్యక్తి సెల్‌టవర్‌పైనే ఉన్నాడు. గురువారం ఉదయం ఎక్కిన వ్యక్తి సోమవారం రాత్రి వరకు దిగలేదు. పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా అతడు కిందకు దిగడం లేదు.

మద్యం విక్రేత అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 22 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు పంచాయతీ నెహ్రూకాలనీకి చెందిన మోగాడ రవిశంకర్ సత్రంపాడు నాయుడు హోటల్ వద్ద మద్యం విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఐదు మద్యం బాటిల్స్, రూ.150 స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ముగ్గురు కోడిపందేలరాయుళ్లు..

జంగారెడ్డిగూడెం, జనవరి 22 : కోడిపందేల శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. వివరాలివి. మండలంలోని ఎ.పోలవరం గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,120 నగదు, ఒక కోడిపుంజు, కోడికత్తిను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.








యలమంచిలిలో రామభక్తుల ర్యాలీ.. తూర్పుపాలెంలో రాములోరి పోస్టర్‌కు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు.. సిద్దాపురంలో నగర సంకీర్తన.. రామాలయంలో ఎమ్మెల్యే నిమ్మల పూజలు.. పెనుగొండలో శ్రీరాముడిని దర్శించుకుంటున్న పితాని.. రాజులపేటలో చిన్నారులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివ

అంతటా రామ జపం

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేళ.. జిల్లాలో ప్రత్యేక పూజలు..హోరెత్తిన జైశ్రీరామ్ నినాదం.. నగర సంకీర్తన..శోభాయాత్ర

నరసాపురం, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠతో సోమవారం జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నామ స్మరణం మార్మోగింది. వాడవాడల రాములోరి కల్యాణం, ఊరేగింపులు, శోభా యాత్రలు, రామజపం, హనుమాన్ చాలీసాల పఠనంతో ఎక్కడ చూసినా.. అధ్యాత్మిక చింతనే కనిపించింది. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో శ్రీరామనామ భక్తి పాటలే వినిపించాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు తలస్నానాలు ఆచరించి ఆలయాలను సందర్శించారు. ఇళ్లల్లో దీపారాధనలు చేసి శ్రీరాముడికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. చాలా చోట్ల అయోధ్య పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎల్‌సీడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. రామాలయాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. రాత్రి దీపారాధనలు చేసి సీతారాములను పల్లకిల్లో ఊరేగించారు.

ఆకివీడు: అయోధ్యలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో స్థానిక మాదివాడ కోదండ రాముడిని ఎమ్మెల్యే రామరాజు దర్శించుకొని వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర ప్రముఖులు పల్లకీ మోస్తూ నగర సంకీర్తన చేశారు. వెలంపేట కోదండ రామాలయంలో మాజీ ఎమ్మెల్యే శివ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు శోభాయాత్ర నిర్వహించారు. కొందరు భక్తులు ప్రసాదాలు, పానకాలు, అన్న సమారాధనలు చేపట్టారు. అందరి బంధువు..ఆదుకొనే ప్రభువు అయోధ్య రామయ్యా అన్నారు.

ఆకివీడు రూరల్: సిద్ధాపురం, రాజులపేట, పెదకాపవరం, గ్రామాలలోని శ్రీకోదండరామాలయంలో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ అనంతరం గ్రామోత్సవంలో ప్రసాద వితరణలో భక్తులు పాల్గొన్నారు.

కాళ్ళ: కాళ్ళ, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కోపల్లె, కోమటిగుంట, బొండాడ, కాళ్ళకూరు, దొడ్డనపూడి, వేంపాడు, సీసలి, కలవపూడి, ప్రాతాళ్ళమెరక, కోలనపల్లి, మాలవానితిప్ప, పల్లిపాలెం, తదితర గ్రామాల్లోని రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగర సంకీర్తన, అన్నదానాలు నిర్వహించారు. కాళ్ళలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివ రామరాజు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య శ్రీరామచంద్రస్వామి, ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు.

భీమవరం అర్బన్: అయోధ్యలోని బాల శ్రీరామ చంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని అడ్డవంతెన వద్ద క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో శ్రీరాముని మండపంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, కలవపూడి శివరామరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, కనకరాజు సూరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.





భీమవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపాలంకరణ.. గునుపూడిలో హనుమాన్ చాలీసా పారాయణ.. భీమవరంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ

6వ వార్డులో బొక్కావారి పాలెం రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పాలకోడేరు/ఉండి: అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పెన్నాడ గ్రామంలో సోమవారం నాడు జైశ్రీరామ్ అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు పంచారు. భక్తాంజనేయస్వామి గుడి వద్ద దీపాలు వెలిగించారు. గొల్లలకోడేరు శివాలయం వద్ద అయోధ్యలో రామాలయం నిర్మాణం ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం రాత్రి శివాలయంలో ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకటశివరామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నసంతర్పణలో పాల్గొన్నారు. ఉండిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే శివ పాల్గొన్నారు. పెద్దఅంజనేయస్వామి ఆలయం వద్ద బెల్లపు పానకంను భక్తులకు పంపిణీ చేశారు

వీరవాసరం: రాయకుదురులోని ఉమా మూలేశ్వర స్వామి దేవస్థానంలో విశేష అభిషేకాలను నిర్వహించారు. బాలరాముని ప్రతిష్ఠ సమయంలో గంగా, గోదావరి జలాలతో పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో శ్రీరాముని లక్ష్మణ సీతాసమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దూసనపూడి రామాలయం వద్ద నుంచి భక్తులు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. నందమూరుగరువులోని శ్రీరామ భక్తాంజనేయస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద నుంచి వీరవాసరం వరకూ యువకులు జెండాలు చేపట్టి జైశ్రీరాం అంటూ శోభాయాత్ర చేశారు.

భీమవరం టౌన్: పంచారామ క్షేత్రమైన సోమేశ్వర స్వామి ఆలయ ఎదురుగా ఉన్న స్థలంలో హనుమన్ భక్తసమాజం 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంతో పాటు అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులతో పారాయణ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పట్నంలో పలు ప్రాంతాల్లో శ్రీరామనవమి ముందే వచ్చిందా అన్నంతగా రామనామ స్మరణతో అనేక ప్రాంతాలు మారుమోగుతున్నాయి. భక్తులకు చలివిడి పానకాల అందజేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. అన్ని కూడళ్ళలోనూ, వీధుల్లోనూ అయోధ్య రామాలయం, శ్రీరామచంద్రుడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అనేక మంది తమ ఇళ్ళవద్ద కాషాయ జెండాలను ఎగురువేసి తమ రామభక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్యసంఘం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థలు ప్రత్యేకంగా ప్రసాదాన్ని, పానకాన్ని భక్తులు పంపిణీచేశారు.

యలమంచిలి: గ్రామాల్లో జై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. పలుగ్రామాల్లో భక్తులు బైక్‌లపై కాషాయ జెండాలు ధరించి, జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాలను సుందరంగా అలంకరించి, స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

పెంటపాడు: కె. పెంటపాడు భైరాగిమఠం గోపాల స్వామి ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫిట్‌పర్సన్ రవిశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్రత్రిపాఠి సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. పెంటపాడు రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో రెడ్డి రామాలయంలో పూజలు చేశారు. సాయంత్రం బాణసంచా కాల్పుల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అలంపురం టీబీఆర్ స్కూల్లో ఛైర్మన్ తనుబుద్ది భోగేశ్వర రావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడు కాపుల రామాలయంలో దీపోత్సవం నిర్వహించారు.

పెనుమంట్ర: నత్త రామేశ్వరంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు పెనుమంట్ర గ్రామంలో శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. అన్న సమారాధన నిర్వహించారు.

పాలకొల్లు టౌన్: రామ నామ స్మరణతో రాములోరి పల్లకీల ఊరేగింపులతో పట్టణప్రాంతమంతా మారుమ్రోగింది. ఎల్‌ఆర్‌పేటలో మాజీఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రామాలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రావూరి సుధ ఆధ్వర్యంలో స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి అయోధ్య రామమందిర ప్రారంభ దృశ్యాలను భక్తులు చూపించారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శ్రీరాముని రూపాలతో వేసిన ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నాయి

పాలకొల్లు రూరల్: అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠలో యావత్ భారతదేశంలోని అందరి చిరకాల కల నెరవేరిందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆగర్తిపాలెం గ్రామ రామాలయంలో సోమవారం జరిగిన ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

భీమవరం రూరల్: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున జైశ్రీరామ్ అంటూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయం ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసి అఖండ జ్యోతి వెలిగించి పాదుకలకు పూజ చేసి అఖండ జ్యోతిపాదికలతో ర్యాలీ ప్రారంభించారు.

ఆచంట: తూర్పుపాలెంలోని క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన బాల రాముని ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని బలుసులమ్మ ఆలయం వద్ద శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వానపల్లిగూడెం రామాలయంలో పూజలు జరిగాయి. సీతారాంపేట రామాలయంలో అధ్యక్షులు నరిసే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సారె సమర్పించారు. శ్రీనివాస గొడౌన్స్ సమీపాన అభయాంజనేయస్వామి, లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించి అన్నసమారాధన జరిపారు. దండగర్రలో గీతా సమాజం సారె సమర్పించింది. ముందుగా గ్రామంలో కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

తణుకు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం తణుకు వాసవీ మాత ఆలయంలో సీతారాముల విగ్రహాలకు పంచామృత అభిషేకం చేశారు. భక్తులు విష్ణు సహస్రనామ, శ్రీరామ పారాయణం నిర్వహించారు తణుకు ఆంజనేయ స్వామి ఆలయంలో కీర్తనలు, పూజలు రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. రేలంగిలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని మంత్రి కారుమూరి ప్రతిష్ఠించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, భక్తులు పాల్గొన్నారు.

పెనుగొండ: ఎన్నికల పాద యాత్రలో భాగంగా సిద్దాంతం నక్కావారిపాలెంలో రామాలయంలో మాజీ మంత్రి పితాని ప్రత్యేక పూజలు చేశారు. జనసేన నియోజకవర్గ నాయకులు చేగొండి సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: పిప్పరలో ఆధ్యాత్మికవేత్త కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో జైశ్రీరామ్ నినాదాలతో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, రామభక్తులు, మహిళలు పురవీధుల్లో శోభాయాత్ర జరిపారు. గణపవరంలో సువర్చల సమేత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఇందుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించారు. దండు మారెమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యులు ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు.

అంగన్‌వాడీల అరెస్టును ఖండిస్తూ రాస్తారోకో

భీమవరం అర్బన్, జనవరి 22: అంగన్వాడీల అక్రమ అరెస్టును ఖండిస్తూ సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్‌బ్లాక్, ఎంసీపీఐ, టీడీపీ, జనసేన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించమని విజయవాడ వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను నాయకులను అర్ధరాత్రి ఇళ్ళ వెళ్లి అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయలని, ఎస్మా ప్రయోగాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో బి.బలరాం, కోనాల భీమారావు, లంకా కృష్ణమూర్తి, అంగన్వాడీ యునియన్ నాయకులు డి.కళ్యాణి, సీఐటీయు నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, ఏఐటీయుసీ నాయకులు చల్లబోయిన రంగారావు, జక్కంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ సోమవారం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. విజయవాడలో అంగన్‌వాడీల గళం వినిపించేందుకు వెళుతున్న అంగన్‌వాడీలను రైల్వే, బస్టాండ్‌ల్లో అరెస్టు చేసి స్టేషన్లకు తీసుకెళ్ళడందారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు అన్నారు.

ఆకివీడు: ఆకివీడు నుంచి విజయవాడ వెళుతున్న ఏడుగురు అంగన్వాడీలను స్థానిక రైల్వే స్టేషన్ దగ్గర అదుపులో కి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం 5.30ల కు పంపించారు. దీనిపై ఎస్ఐ బత్తిన నాగబాబును ప్రశ్నించగా కేసులు నమోదు చేశామన్నారు.

తణుకు: అక్రమంగా అరెస్టు చేసిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు సోమవారం తణుకు నరేంద్ర కూడలిలో ఆందోళన చేశారు. మగ పోలీసులే మహిళల పట్ల దురుసుగా వ్యవహరించడం దారుణమన్నారు. సీఐటీయూ నాయకులు గార రంగారావు, కడలి వీర్రాజు, ఎ. ఆంజనేయులు పాల్గొన్నారు.



నరసాపురంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, వామపక్షాలు

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

భీమవరం అర్బన్, జనవరి 22: భీమవరంలోని రెస్టహౌస్ రోడ్డుకు చెందిన తామరావపు వెంకట రమణ, ప్రియ దంపతుల బాబుకి వైద్య ఖర్చుల నిమిత్తం జేపీ ఫౌండేషన్ సహకారంతో సోమవారం రూ.50వేల నగదును జనసేన జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. బాబుకి ఆక్సిజన్ అందపోవడంతో భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, చింతా లక్ష్మణ్, నాగిడి శ్యామ్, జుడ చిన్న, ములగాల సంజయ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, జనవరి 22 : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌జీఓ డా. యాళ్ళ హానోక్‌వర్థన్ అన్నారు. సోమవారం భీమవరంలోని ట్రెజరీ కార్యాలయ ఆవరణంలో భీమవరం నియోజకవర్గ దివ్యాంగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హానోక్ వర్థన్ మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ పెంచాలని, ఉచితంగా బియ్యంను రేషన్ కార్డుల ద్వారా ఇవ్వాలన్నారు.40శాతం అంగవైకల్యం ఉన్నవారికి వ్యాపారం నిమిత్తం లక్ష నుంచి రెండు లక్షల గ్యారెంటీ లేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ బాబుతోనే సాధ్యం



దుంపగడపలో భవిష్యత్ గ్యారెంటీ బాండ్లు చూపుతున్న ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు రూరల్ జనవరి 22: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. దుంపగడప గ్రామంలో జరిగిన బాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. తాగు, సాగునీరు లేదని, తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయిన కాలువలను బాగు చేయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాదు, నౌకట్ల రామారావు, క్లస్టర్ ఇన్‌చార్జి పిన్నమరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ముద్దే కొండ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ వితరణ

ఆకివీడు రూరల్ జనవరి 22 : కోళ్ళపర్రులోని ఎంపీయూపీ పాఠశాలకు రూ. 20000 విలువ చేసే మంచినీటి ట్యాంక్‌ను తోట వెంకటాచలం అందజేశారని ప్రధానోపాధ్యాయులు చందన ప్రభాకర్ తెలిపారు. గ్రామస్థుల సహకారంతో పాఠశాలలో కంప్యూటర్, ప్రింటర్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

జనసేనలో చేరికలు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 22: పట్టణంలోని 21వ వార్డు కొబ్బరితోట నుంచి పిడుగు రామ్మోహన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి బొలిశెట్టి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం బొలిశెట్టిని సత్కరించారు.

ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం క్రైం, జనవరి 22 : సత్వరమే ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యు రవిప్రకాశ్ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. భీమవరం సబ్‌డివిజనల్ పోలీసు అధికార కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ రవిప్రకాశ్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.భీమారావు ఇరువురు స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి 8 ఫిర్యాదులు వచ్చాయి. ఎక్కువగా వరకట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదలపై ఫిర్యాదులు వచ్చాయి.

నేడు డయల్ యువర్ డీఎం

భీమవరం టౌన్, జనవరి 22 : భీమవరం ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న 5మండలాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు ఏమైనా ఉంటే సమస్యలను డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకురావాలని డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం4గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని, సమస్యలను, సలహాలను 99592 25485 నెంబరుకు ఫోన్ చెయ్యాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

భీమవరం రూరల్, జనవరి 22 : ఏఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటిరియల్ పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ పాల్గొన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, హైస్కూల్స్‌లో చదువుతున్న సుమారు 13,500 మంది విద్యార్థులకు విజయకేతనం పేరుతో ముద్రించిబడిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.

'పాత్రికేయులకు అండగా ఉంటా'

తణుకు, జనవరి 22 : పాత్రికేయులకు అండగా ఉంటానని మంత్రి కారుమూరి హామీ ఇచ్చారు. సోమవారం తణుకులో ఏరియా ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఇళ్ళ స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పాత్రికేయులకు స్థలాలు అందేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రక్తదానం

ఉండి, జనవరి 22: చిక్కాలవీరన్ననగర్‌లో జనసేన గ్రామ ప్రధాన కార్యదర్శి కంది దుర్గప్రసాదు, వినోదు, బాలాజీ, క్రాంతికుమార్, జగదీష్ మిత్రబృందం ఆధ్వర్యంలో రక్తదానం చేశారు.



తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నివాసంలో పట్టణానికి చెందిన 70 మంది యువకులు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.